క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం 11కేవీ చిత్రా లేఅవుట్ ఫీడర్ పరిధిలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారామాపురం, చిత్రా లేఅవుట్, ఆనంద్‌నగర్, సుధీర్‌కుమార్ కాలనీ, రంగనాయకులగుట్ట పరిసర కాలనీలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

క్రికెట్‌లో 'ఫ్రెండ్స్ యూత్' సత్తా



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శేఖర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని ఏవైఆర్ క్రికెట్ మైదానంలో అల్మాస్‌గూడ ప్రీమియర్ లీగ్–2023 క్రికెట్ పోటీలను నిర్వహించారు. శుక్రవారం పోటీ ముగింపు సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయపల్లి శేఖర్‌రెడ్డి ముఖ్యులుగా విచ్చేసి విజేతగా నిలిచిన ఫ్రెండ్స్ యూత్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.21 వేల నగదు అందజేశారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన ఆర్ఎంఆర్ యూత్ జట్టుకు రూ.11 వేల ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అన్ని రకాల క్రీడల్లో రాణిస్తున్న యువతను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు వీర కర్ణారెడ్డి, స్థానిక యువకులు పాల్గొన్నారు.

పరీక్షాపే చర్చలో పాల్గొన్న విద్యార్థులు



ప్రధాని కార్యక్రమాన్ని డిజిటల్ స్క్రీన్ ద్వారా తిలకిస్తున్న విద్యార్థులు

కందుకూరు: మండల కేంద్రంలోని క్రిక్ పాఠశాలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన పరీక్షాపే చర్చా కార్యక్రమంపై శుక్రవారం డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి? అనే తదితర అంశాలపై మోదీ చెప్పిన సలహాలు, సూచనలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు, బీజేపీ మండల అధ్యక్షుడు అనేగాని అశోక్‌గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర దిలీప్‌గౌడ్, మండల అధ్యక్షుడు లింగంయాదవ్, నాయకులు శ్రీనివాస్‌జీ, అనిల్‌కుమార్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే



కందుకూరు చౌరస్తాలో యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎలక్ట్రీషియన్లు

కందుకూరు: విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ ఆల్వా ఎడిసన్ జయంతి రోజున నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్ డేను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో ఎలక్ట్రీషియన్ల సంఘం మండల అధ్యక్షుడు గాదె సత్తయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జె.రవి యాదవ్, పి.లక్ష్మణ్, గాదె కుమార్, రాయికంటి రాంచంద్రి, వెంకటాచారి, గాదె చెన్నయ్య, మహేందర్, రాజ్‌కుమార్, బి.ఆంజనేయులు, బండ ఐలయ్య, ఎస్ఎస్.యాదవ్, శ్రీను, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

శివగంగలో ప్రత్యేక పూజలు



విశేష పూజలందుకున్న రాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం పలు పూజలు నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో ఉదయం శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు పలువురు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య కొలిక్కివచ్చేనా?



తుక్కుగూడ శ్రీశైలం జాతీయ రహదారి పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు

- అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- రాకపోకలకు అంతరాయం
- సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటులో నిర్లక్ష్యం
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో జనాభా పెరుగుతోంది. దీంతో శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ట్రాఫిక్ పెరగడంతో ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోంది. జాతీయ రహదారిపై వేగ నియంత్రణ, సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. రోడ్డు దాటాలంటే పాదచారులు భయాందోళన చెందుతున్నారు. దీనికి రోడ్డుపై ఆటోలు, కార్లను ఎక్కాడ పడితే అక్కడా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత ముదురుతోంది.

రోడ్డు పక్కనే పార్కింగ్

శ్రీశైలం జాతీయ రహదారి ఒక్కో వైపు 25 అడుగుల విస్తీర్ణం కలిగి ఉంది. తుక్కుగూడలో రెండు కిలో మీటర్ల మేర వ్యాపార వాణిజ్య సంస్థలు విస్తరించి ఉన్నాయి. దీంతో వివిధ పనులు నిమిత్తం వచ్చే వారు తమ వాహనాలను నడిరోడ్డులో ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. 25 అడుగల రోడ్డులో 10 అడుగుల మేర వాహనలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. హోటల్స్, వైన్ షాపుల ముందు పరిస్థితి మరింత దారణంగా ఉంటోంది. అక్రమ పార్కింగ్ వల్ల జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

ట్రాఫిక్ వ్యవస్థ లేకపోవడంతో

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ రోజురోజుకూ పెరుగుతున్నా నియంత్రణకు పోలీసులు, మున్సిపల్ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వాహనాల రద్దీ పెరగడం, వేగ నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శ్రీశైలం జాతీయ రహదారిపై ఒక్కచోట కూడా సిగ్నల్ వ్యవస్థ లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో నిత్యం శ్రీశైల మల్లన్న దర్శనం కోసం శంషాబాద్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు, వండర్‌లా వినోద కేంద్రం, ఫ్యాబ్ సిటీ, హార్డ్‌వేర్ పార్కు, మంఖాల్ పారిశ్రామిక వాడ ఇలా అనేక చోట్లకు ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.

నిత్యం ప్రమాదాలే

రెండేళ్ల క్రితం సిండికేట్ బ్యాంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తుక్కుగూడకు చెందిన దంపతులు మృతి చెందారు. గత ఏడాది అక్టోబర్ 28న తుక్కుగూడకు చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కొద్ది రోజుల క్రితం ఓ కారు అదుపు తప్పి షాపులోకి దూసుకెళ్లింది. నిత్యం ఈ రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి



తుక్కుగూడలో జాతీయ రహదారి ఉండడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ఇప్పటికే మేం కొన్ని యూటర్న్‌లను మూసి వేయించాం. సోమవారం సంత కాండంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. ఉన్నతాధికారులు స్పందించి సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

– రాకేష్‌గౌడ్, సర్దార్‌నగర్



మహిళకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

మహిళా ఆర్థిక స్వావలంబనకు సాకారం

- మంత్రి సబితారెడ్డి
- కుట్టు మిషన్లు, సర్టిఫికెట్ అందజేత

పహాడీషరీఫ్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో మూడు నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 33 మంది మైనార్టీ మహిళలకు శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్‌తో కలిసి మంత్రి కుట్టు మిషన్లతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మహిళలపై వేధింపులను ఆపేందుకు చేపట్టిన షీటీమ్స్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. నేరాల నివారణ కోసం ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం ఉండేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుందన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్స్ డీసీపీ షేక్ సలీమా, ఎల్.బి.నగర్ డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్, నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, సయ్యద్ యూసుఫ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై బీజేపీ నాయకుల ఫిర్యాదు



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: బాధ్యతాయుతమైన ఎమ్మెల్సీ పదవిలో ఉండి రాష్ట్ర గవర్నర్ తమిళిసైపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. గవర్నర్ తమిళిసైని విమర్శించిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లకు చెందిన బీజేపీ నాయకులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. సాధారణ రాజకీయ నాయకులను విమర్శించిన మాదిరిగా గవర్నర్‌పై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, బీఆర్ఎస్ నాయకులకు గవర్నర్ పట్ల ఎలాంటి గౌరవం లేదని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు నీలారవినాయక్, ముత్తంగి కరుణానిధి, భిక్షపతిచారి, నాయకులు చెవ్వ శ్రావణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

జెడ్పీటీసీ జంగారెడ్డి



కందుకూరులో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: నిరుపేదలకు ఆపన్నహస్తంలా సీఎంఆర్ఎఫ్ మారిందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కందుకూరుకు చెందిన యాదయ్యకు రూ.12500, పంబాల మహేశ్‌కు రూ.35 వేలు, దెబ్బడగూడకు చెందిన సత్తమ్మకు రూ.25 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు ఆ చెక్కులను శుక్రవారం తన కార్యాలయంలో లబ్దిదారులకు ఆయన అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సామయ్య, దాసర్లపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్, సుదర్శన్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎక్స్‌అఫీషియో ఓట్లను రద్దు చేసుకోవాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

మున్సిపల్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్

తుక్కుగూడ: మున్సిపాలిటీలో మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, యెగ్గే మల్లేశంలు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా నమోదు చేసుకున్న ఎక్స్‌అఫీషియో ఓట్లను రద్దు చేసుకోవాలని తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020 జనవరి 27 తేదీన జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుగా అక్రమంగా తమ ఓటును నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో అప్పటి ఎమ్మెల్సీ నాయిని నర్సింహారెడ్డి మరణించగా, ఎంపీ కె.కేశవరావు తమ ఓటును జీహెచ్ఎంసీ పరిధికి మార్చుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే ముగ్గురు సభ్యులు ఈ మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతున్నారని అన్నారు. ఈ ముగ్గురు ఓట్లు చెల్లవని గతేడాది ఆగస్టు 24న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చినట్లు తెలిపారు. ఇన్ని రోజులు మున్సిపల్ చైర్మన్ అంశం కోర్టులో ఉండటంతో ఈ విషయాన్ని ప్రస్తావించలేదన్నారు. ఇప్పటికైనా వారు తమ ఎక్స్‌అఫీషియో ఓటును స్వచ్ఛందంగా రద్దు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, మున్సిపల్ కార్యాలయం వద్ద తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కృష్ణ, గోరిగె దేవేందర్, ఎస్.బాలరాజ్, కటికల ఆంజనేయులు, దొంతమోని రాజు, పల్లె జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు లాభదాయకం

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గీతారెడ్డి



అన్నోజిగూడలో పంట వివరాల నమోదును పరిశీలిస్తున్న గీతారెడ్డి తదితరులు

కందుకూరు: రైతులు కూరగాయల సాగు చేపట్టి లాభాలు ఆర్జించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గీతారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నోజిగూడలో వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టిన పంట వివరాల నమోదును ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ కూరగాయలకు మార్కెట్లో మంచి ధర ఉంటుందని, అందుబాటులో మార్కెట్ ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం యాసంగి వరిలో కాండం తొలిచే పురుగును గుర్తించినట్లు తెలిపారు. నివారణకు 15 రోజుల పిలక దశలో ఉన్న వరి పైరుకు ఎకరాకు పది కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి పి.యాదగిరి, ఏఈఓ డి.రాఘవేంద్రాచారి తదితరులు ఉన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



జైత్వారంలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

కందుకూరు: పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జైత్వారం సర్పంచ్ ఎర్రబైరు సదాలక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జైత్వారంలో పశువైద్యాధికారి డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో హిమాలయ కంపెనీ, వీర్ బ్యాక్ కంపెనీల సహకారంతో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రైతులు సకాలంలో తమ పశువులకు చికిత్స అందించి ప్రయోజనం పొందాలన్నారు. డాక్టర్ రేవతి మాట్లాడుతూ.. పశువులకు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నప్పుడు పశు సంవర్ధక సిబ్బందిని సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలన్నారు. మొత్తం 78 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 30 పశువులకు నట్టల మందులు వేశామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్, రాచులూరు పశు వైద్యులు డాక్టర్ షాహిన్‌షేక్, సిబ్బంది వసంత, జంగయ్య, మాధవి, అప్సర్, ఆంజనేయులు, గోపాలమిత్ర ఆరీఫ్, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ



వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నర్సింహారెడ్డి

మహేశ్వరం: మండల కేంద్రంలోని వెంకట్‌రెడ్డి, సిరిగిరిపురం గ్రామానికి చెందిన శంకరయ్య, అమీర్‌పేట్ గ్రామానికి చెందిన చాకలి రమేష్‌లు ఇటీవల మరణించారు. ఈ మేరకు వారి కుటుంబాలను శుక్రవారం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బడంగ్‌పేట్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఆపదలో ఉన్న వారికి తాను, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాచని నర్సింహారెడ్డి అన్నారు. అనంతరం వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేటర్ పెద్దబాయి సుదర్శన్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరు రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లె కుమార్, దశరథ్ నాయక్, ఆవుల యాదయ్య, లాజర్, రవి, శ్రీకాంత్, భాస్కర్, మహేందర్‌రెడ్డి, శశికాంత్ పలువురు పాల్గొన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి భూమి పూజ

బడంగ్‌పేట్: మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని ఆంజనేయస్వామి టెంపుల్ వద్ద కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి శనివారం ఉదయం 9గంటలకు మంత్రి సబితారెడ్డి భూమి పూజ చేయనున్నారు. శుక్రవారం ఆర్యవైశ్య సంఘం బాలాపూర్ మండల అధ్యక్షుడు నాళ్ల శ్రీనివాస్ గుప్తా ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాలాపూర్ మండలంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం లేకపోవడంతో మంత్రి సబితారెడ్డి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. జిల్లెలగూడలోని ధాతునగర్ వద్ద ఆలయ నిర్మాణానికి మంత్రి స్థలం కేటాయించినట్లు తెలిపారు. భూమి పూజ కార్యక్రమానికి ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కోరమండల్ కంపెనీ ప్రతినిధులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా, ప్రతిభ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు కోరమండల్ ఇంటర్నేషనల్ ఎరువు కంపెనీ ప్రతినిధులు బహుమతులు అందజేసి అభినందించారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, క్రీడల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారుల ప్రోత్సాహానికి కోరమండల్ కంపెనీ నిరంతరం కృషి చేస్తుందని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతిఒక్క విద్యార్థి చదువుతో క్రీడల్లో రాణించాలని వారు సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ప్రసాద్, శ్రీకాంత్, అవినాష్, శ్రీనివాస్, తుక్కుగూడ ఎరువుల దుకాణం యజమాని వెంకటేశ్వర్‌రెడ్డి, పలువురు గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో గెలిచిన విజేతలకు నిర్వాహకులు మొదటి బహుమతిగా రూ.11 వేలు బుసనగారి సుమన్‌కు, రెండవ బహుమతిగా పండల నరేందర్‌కు రూ.6 వేల నగదుతో పాటు షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్, బీఆర్ఎస్ నాయకులు పోరెడ్డి బుచ్చిరెడ్డి, గడ్డి రాజు, గంగాపురం నర్సింగ్‌గౌడ్, పబ్బతి శివకుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ పీఎస్ ఎదుట ధర్నా



పీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లోని 119 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో ఎంఆర్‌పీఎస్ నాయకులపై దురుసుగా ప్రవర్తించి చంపుతామని బెదిరించిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, నాన్‌బెయిలబుల్ కింద శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎంఆర్‌పీఎస్, బీఎస్పీ, బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీల ఆధ్వర్యంలో బడంగ్‌పేట కార్పొరేషన్, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌ల ఎదుట బాధితుడు గట్టు బాలకృష్ణతో కలిసి ధర్నాకు దిగారు. దళితుల మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దాడులు చేస్తున్న వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో దళితుల మీద దాడులు జరుగుతున్న స్పందించని మంత్రి సబితారెడ్డి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. చంపుతామని బెదిరించిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. అనంతరం మీర్‌పేట్ ఎస్ఐ నరసింహ నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నా చేపట్టిన వారిలో బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, ఎస్ఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌బాబు, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బొర్ర రవి, టీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు చిత్రం సాయి తదితరులున్నారు.

క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం



మీర్‌పేట పెద్ద చెరువు వద్ద క్రీడా ప్రాంగణం కోసం ఎంపిక చేసిన స్థలం

- కార్పొరేషన్‌లో మొత్తం 16 స్థలాలు ఎంపిక
- పెద్ద చెరువు వద్ద రెండు ఎకరాల స్థలంలో పనులు షురూ..
- రూ.2 కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న యువత

మీర్‌పేట: ఓవైపు చెరువులను అభివృద్ధి చేస్తూనే మరోవైపు స్థానిక యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు మీర్‌పేట కార్పొరేషన్‌లో క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సబితారెడ్డి చొరవతో ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో క్రీడా ప్రాంగణాలకు సంబంధించి 16 చోట్ల స్థలాలను ఎంపిక చేశారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడటంతో పాటు, యువతకు ఉపయోగపడేలా క్రీడా ప్రాంగణాలు నిర్మించడంపై స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మీర్‌పేట పెద్ద చెరువు వద్ద క్రీడా ప్రాంగణం నిర్మాణానికి గాను 2 ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో పాటు రూ.2 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్‌తో పాటు పలు రకాల క్రీడల కోసం ప్రత్యేకంగా క్రీడా కోర్టులను నిర్మించనున్నారు. మంత్రి ఆదేశాల మేరకు ఇప్పటికే పనులు మొదలయ్యాయి. అదేవిధంగా ప్రాంగణం చుట్టూ కాంపౌండ్ వాల్‌ను కూడా నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ క్రీడా ప్రాంగణం పూర్తయితే మీర్‌పేటతో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

త్వరలో అందుబాటులోకి తెస్తాం



క్రీడా ప్రాంగణాలను త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద చెరువు వద్ద ఇప్పటికే పనులు మొదలయ్యాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి స్థానికులకు క్రీడా ప్రాంగణాన్ని అందుబాటులోకి తెస్తాం. దీంతో పాటు కార్పొరేషన్‌లో మొత్తం 16 స్థలాలను ఎంపిక చేయగా, రెండుచోట్ల క్రీడా ప్రాంగణాల పనులు చివరి దశకు చేరుకున్నాయి.

– సిహెచ్.నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్